మరో ప్రజా సంకల్పం
Maro Praja Sankalpam • Main Edition

రూ.2 కోట్లకు పైగా అనుమానాస్పద లావాదేవీలు

మరోవైపు చంద్రబాబు మాజీ వ్యక్తిగత కార్యదర్శి నివాసాల్లో జరిగిన ఐటీ సోదాలు, రూ.2 వేల కోట్లకు పైగా అనుమానాస్పద లావాదేవీలపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రకటన, చంద్రబాబుకు జారీ అయిన రూ.118 కోట్ల ఐటీ షోకాజ్ నోటీసు, జగన్ గతంలో ఫిర్యాదు చేసిన మాజీ ఈడీ అధికారి బొల్లినేని శ్రీనివాస గాంధీపై నమోదైన కేసులు.. ఇలా అనేక వ్యవహారాల్లో తాజా దర్యాప్తు స్థితిపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైయస్ జగన్ కేసుల్లో విచారణ వేగం కోరుతున్న కేంద్ర సంస్థలు.. చంద్రబాబు హయాంలో వెలుగుచూసిన ఆర్థిక అవకతవకలు, స్కాములపై కూడా అంతే పారదర్శకంగా సమాధానాలు చెబుతాయా?

సీమెన్స్‌లో నిధుల మళ్లింపు నిజమే

సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో నిధుల మళ్లింపునకు సంబంధించిన అంశాలను 2023 మార్చి 14న ఈడీ అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించింది. ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో రూ.241 కోట్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అభియోగాలు ఉన్నాయని పేర్కొంది. డిజైన్‌టెక్ సిస్టమ్స్ నుంచి స్కిల్లర్ ఎంటర్‌ప్రైజెస్‌కు, అక్కడి నుంచి పలు డొల్ల కంపెనీలకు నిధులు మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర వస్తువులు, సేవలు సరఫరా చేయకుండానే నకిలీ బిల్లులు సృష్టించి నిధులను మళ్లించారన్నది దర్యాప్తు సంస్థ అభియోగం. దాదాపు రూ.70 కోట్లకు సంబంధించిన మనీ ట్రయల్‌ను గుర్తించినట్లు ప్రకటించింది. ప్రభుత్వ ఖజానా నుంచి విడుదలైన నిధులు ప్రైవేటు సంస్థల ద్వారా డొల్ల కంపెనీలకు చేరినట్లు దర్యాప్తులో వెల్లడైనప్పుడు, ఆ నిధుల విడుదలకు దారితీసిన ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టును ఎవరు ఆమోదించారు? చెల్లింపులను ఎవరు అనుమతించారు? నిధుల వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన అధికారుల పాత్ర ఏమిటి? ఇవన్నీ ప్రజలకు తెలియాల్సిన అంశాలే.

నలుగురి అరెస్టులు.. ఆ తర్వాత?

సీమెన్స్ వ్యవహారంలో సుమన్ బోస్, వికాస్ ఖన్వేల్కర్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేష్ గోయల్‌లను ఈడీ అరెస్టు చేసింది. వీరిని విశాఖపట్నంలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో హాజరుపరచగా ఏడు రోజుల ఈడీ కస్టడీకి అనుమతి లభించింది. 2023 ఏప్రిల్‌లో డిజైన్‌టెక్ సంస్థకు సంబంధించిన రూ.31.20 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ అటాచ్ చేసింది. 2024 అక్టోబర్ 15న మరో రూ.23.54 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్లు ప్రకటించింది. ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, పుణె తదితర ప్రాంతాల్లోని స్థిరాస్తులు, బ్యాంకు నిల్వలు, షేర్లు ఈ చర్యల్లో ఉన్నాయి. మొత్తం జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.54.74 కోట్లకు చేరింది. డొల్ల కంపెనీలు, నకిలీ ఇన్వాయిస్‌లు, బహుళస్థాయి ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తులకు కమీషన్ల చెల్లింపుల గురించి ఈడీ వెల్లడించింది. అయితే నిధుల తుది లబ్ధిదారులందరినీ గుర్తించారా? ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టంలో ఎంత మొత్తాన్ని తిరిగి రాబట్టారు? జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత న్యాయస్థితి ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేవు.